# జర్నలిస్ట్ వార్త

RNI NO:Title-Code:-TELTEL02102

అనుక్షణం ప్రజల పక్షం... తెలుగు దిన పత్రిక




ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాలు 4లో.


WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్ Cell:9701249103



సంపుటి - 1 సంచిక - 244 మంగళవారం17 సెప్టెంబర్ 2024 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజిలు -5 వెల - 5/-

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


# అడ్డగోలుగా మాట్లాడితే సహించం



**రాజీవ్ విగ్రహావిష్కరణలో భారాసపై నిప్పులు చెరిగిన సీఎం రేవంత్‌రెడ్డి**

- దేశం కోసం ప్రాణత్యాగం చేసిన చరిత్ర రాజీవ్ గాంధీది.
- కుటుంబమంతా పదవులు పంచుకున్న మీరా విమర్శించేది?
- పదేళ్లలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎందుకు ప్రతిష్ఠించలేదని ప్రశ్న?
- కాలకేయ ముఠా మళ్లీ గ్రామాల మీదకు వస్తోందంటూ ధ్వజం

# తెలంగాణ అస్తిత్వం తాకట్టు

- సచివాలయం ఎదుట రాజీవ్ విగ్రహావిష్కరణ సిగ్గుమాలిన చర్య
- నేడు రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలాభిషేకాలు
- కెటిఆర్ పిలుపు



హైదరాబాద్, సెప్టెంబర్ 16,(జర్నలిస్ట్ వార్త): రాష్ట్ర సచివాలయం, తెలంగాణ అమర జ్యోతి మధ్యలో ఉండాల్సిన తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ గాంధీ విగ్రహాన్ని పెట్టటంపై బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది తెలంగాణ అస్తిత్వాన్ని తాకట్టు పెట్టే సిగ్గుమాలిన చర్య అంటూ మండిపడ్డారు. కాంగ్రెస్ సిఎం రేవంత్ రెడ్డి చర్యకు నిరసనగా మంగళవారం(సెప్టెంబర్ 17) రాష్ట్రంలో ని అన్ని తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలభిషేకాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు కెటిఆర్ పిలుపునిచ్చారు. మిగతాది 2లో...

# రేషన్‌కార్డులకు అక్టోబర్‌లో దరఖాస్తులు

**పౌర సరఫరా ల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**



హైదరాబాద్, సెప్టెంబర్ 16,(జర్నలిస్ట్ వార్త): ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న నిరుపేద కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. అక్టోబర్‌లో రేషన్ కార్డుల ప్రక్రియను ప్రా రంభించాలని నిర్ణయించిం ది. రాష్ట్రంలో దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న అర్హులైన కుటుంబాలకు రేషన్ కార్డు నిత్యావసర సరకులకు, హెల్త్ కార్డు ఆరోగ్యానికి ఉపయోగపడేలా విడివిడిగా అందజేయబోతున్నామని పౌర సరఫరా ల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. హైదరాబాద్ ఎర్రమంజిల్ జలసౌధలో సోమవారం మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి అధ్యక్షతన కొత్త రేషన్ కార్డులు, హె ల్త్ కార్డుల జారీపై మంత్రివర్గ ఉపసంఘం నాలుగవ స మావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపసంఘం స భ్యులుగా ఉన్నా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఎమ్మె ల్సీ తీన్మార్ మల్లన్న, పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీ ఎస్ చౌహాన్, సంయుక్త సంచాలకులు ప్రియాంక ఆల, ఇ తర అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉ న్న దరఖాస్తుల సంఖ్య, కొత్త రేషన్ కార్డులు, హెల్త్ కా ర్డుల పంపిణీ, ఇతర మార్గదర్శకాలపై విస్తృతంగా చర్చించారు. మిగతాది 2లో...

# ప్రపంచ ఫార్మా బ్రాండ్‌గా హైదరాబాద్

**ఫార్మా రంగంలో పెట్టుబడులకు స్వర్గధామంలా చేస్తాం.. జీనోమ్ వ్యాలీలో ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు**



హైదరాబాద్, సెప్టెంబర్ 16,(జర్నలిస్ట్ వార్త): హైదరాబాద్ నగరాన్ని ప్రపంచంలోనే ఒక ఫార్మా కంపెనీల బ్రాండ్‌గా తీర్చిదిద్దుతామని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడించారు. జీనోమ్ వ్యాలీలోని పరిశ్రమల ప్రతినిధులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 30, 40 ఏళ్లుగా కృషి చేస్తున్న ఫార్మా పరిశ్రమలకు మరింత ప్రోత్సాహం, సకల వసతులు కల్పిస్తూ మరిన్ని పెట్టుబడులు వొచ్చే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కృషి చేస్తున్నామని చెప్పారు. సోమవారం లారస్ ల్యాబ్స్, కర్క ల్యాబ్స్ సుమారు 300 ఎకరాల్లో రూ.2 వేల కోట్లతో వందలాది మందికి ఉపాధి కల్పించే విధంగా పరిశ్రమలను ప్రారంభించాయన్నారు.ప్రపంచ ఫార్మా దృష్టిని ఆకర్షించేందుకు జీనోమ్ వ్యాలీని ప్రపంచస్థాయి ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఫార్మా రంగంలో పెట్టుబడులకు స్వర్గధామంలా చేసి ఉపాధి అవకాశాలు, రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. అందుకే, ఫార్మా కంపెనీల దిగ్గజాలతో మరిన్ని పెట్టుబడులు రాబట్టే విషయమై చర్చించామని తెలిపారు. సమావేశంలో టీజీఐఐసీ ఛైర్మన్ నిర్మలా జయప్రకాశ్‌రెడ్డి, ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, కలెక్టర్ గౌతమ్ పోట్రు, పలు ఫార్మా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# 40వేల మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యం



**2035 నాటికి చేరుకోవాలన్న పట్టుదల గ్రీన్ పవర్ పెట్టుబడిదారుల సభలో భట్టి**

గాంధీనగర్ సెప్టెంబర్ 16,(జర్నలిస్ట్ వార్త): తెలంగాణ రాష్ట్రం 2035 నాటికి 40,000 మెగావాట్ల గ్రీన్ పవర్‌ను ఉత్పత్తి చేయాలన్న లక్ష్యంతో ముందుకెళ్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సోలార్ పవర్‌తో నిరంతర విద్యుత్ లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. అలాగే రైతులకు సోలార్ పవర్ ద్వారా అందించే కార్యక్రమం చేపట్టామని అన్నారు. మిగతాది 2లో...




# 18న ఎన్‌పీఎస్ వాత్సల్య స్కీమ్

**ప్రారంభించనున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్**

**18 ఏళ్లలోపు పిల్లలకు స్పెషల్ బెనిఫిట్స్**

# ముసాయిదానే.. కొత్త చట్టం!

**భూరికార్డులకు సంబంధించి 'ఆర్ఓఆర్-2024' ముసాయిదానే ఫైనల్ చేయాలని సర్కారు నిర్ణయం**



హైదరాబాద్, సెప్టెంబర్ 16,(జర్నలిస్ట్ వార్త): రాష్ట్రంలో భూముల రికార్డులకు సంబంధించిన 'రికార్డ్ ఆఫ్ రైట్స్-2024 (ఆర్‌వోఆర్)' చట్టం విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయానికి వచ్చింది. ఒకట్రెండు చిన్న చిన్న మార్పులు మినహా ముసాయిదా కింద రూపొందించిన అంశాలనే చట్టం రూపంలో అమల్లోకి తెచ్చేందుకు రంగం సిద్ధం చేస్తోంది. రెవెన్యూమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి త్వరలోనే దీనిపై ఓ స్పష్టత ఇస్తారని.. సీఎం రేవంత్‌రెడ్డితో చర్చించాక తుది నిర్ణయం ప్రకటిస్తారని రెవెన్యూ వర్గాలు తెలిపాయి.
దాంతోపాటు ఈ చట్టాన్ని వెంటనే అమల్లోకి తెచ్చేందుకు మంత్రివర్గం ఆమోదంతో ఆర్డినెన్స్ జారీ చేస్తారా? లేక అసెంబ్లీలో పెట్టిన బిల్లుపై విస్తృతంగా చర్చించి చట్టంగా చేస్తారా? అన్న దానిపై మాత్రం తర్జనభర్జన కొనసాగుతున్నట్టు వెల్లడించాయి. మిగతాది 4లో...

# ఏపీ, తెలంగాణలకు రెండు వందేభారత్ రైళ్లను ప్రారంభించిన ప్రధాని మోదీ




**దుర్గ్-విశాఖపట్నం , సికింద్రాబాద్-నాగపూర్ మధ్య రైలును వర్చువల్‌గా ప్రారంభించిన మోదీ**

**వారానికి ఆరు రోజులు నడవనున్న తెలుగు రాష్ట్రాల వందేభారత్ రైళ్లు**

# అడ్డగోలుగా మాట్లాడితే సహించం



హైదరాబాద్, సెప్టెంబర్ 16,(జర్నలిస్ట్ వార్త): రాజీవ్ గాంధీ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే దానం నాగేందర్‌తెలంగాణ వాదులందరినీ అడుగుతున్నా.. ఈ జాగాలో రాజీవ్ విగ్రహానికి అర్హత లేదా? ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ సర్వం కోల్పోయి.. కేంద్రంలో అధికారం కోల్పోయినా మాట మీద నిలబడి తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ కుటుంబాన్ని గౌరవించాలి. వాళ్లే(కేసీఆర్) ఇక్కడ రాజీవ్ విగ్రహాన్ని పెట్టాల్సింది పోయి.. ఇవాళ మేము ఆవిష్కరిస్తే అవహేళన చేసి, తొలగిస్తామంటున్నారు. ఎవరొస్తారో నేనూ చూస్తా.. సచివాలయం వెలుపల కాదు.. రాష్ట్రానికి పరిపాలన అందించే సచివాలయం గుండెల్లో ఉండాలనే సంకల్పంతో డిసెంబరు 9న తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నాం.

గడీలలో గడ్డి మొలవాల్సిందేనని ఆనాడు చాకలి ఐలమ్మ చెప్పారు. సాయుధ రైతాంగ పోరాట ఫలితంగా గడీలలో గడ్డి మొలిచింది. గడీలు బద్దలై ప్రజాస్వామిక పాలన వచ్చింది. మీరు అడ్డగోలుగా మాట్లాడితే.. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, రేవంత్‌రెడ్డి చూస్తూ ఊరుకుంటారని అనుకుంటున్నారేమో! ఇవాళ రాజీవ్‌గాంధీ విగ్రహం సాక్షిగా చెబుతున్నా.. మీ ఫామ్ హౌస్‌ల్లో జిల్లేడు మొలవాల్సిందే. అప్పటివరకు కాంగ్రెస్ కార్యకర్తలెవ్వరూ విశ్రమించబోరు” అని భారాస అధినేత కేసీఆర్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. సచివాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన దివంగత మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ కాంస్య విగ్రహాన్ని రేవంత్‌రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. అనంతరం అక్కడ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. “రాజీవ్‌గాంధీ దేశసమగ్రతను కాపాడేందుకు ప్రాణత్యాగం చేశారు. అలాంటి రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని సచివాలయం ముందు.. ట్యాంక్‌బండ్ మీద పెడితే.. ఎందుకు పెడుతున్నారని విమర్శిస్తున్నారు. గాంధీలది కుటుంబ పాలన అంటున్నారు. రాజీవ్ మరణించాక దాదాపుగా 15-20 ఏళ్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. అయినా సోనియా పదవులకు దూరంగా ఉన్నారు. 2004-14 వరకూ బలమైన యూపీయే ప్రభుత్వం ఉన్నా.. సోనియా, రాహుల్‌లు ప్రధానమంత్రి, కేంద్ర మంత్రి పదవులేవీ తీసుకోలేదు. తెలంగాణ బిడ్డ పీవీనర్సింహారావును, మన్మోహన్‌సింగ్ వంటి మేధావులను ఈ దేశానికి ప్రధానులను చేసింది సోనియా కాదా? పదవీ త్యాగం, ప్రాణత్యాగం అంటే వాళ్లది. స్వాతంత్ర్య పోరాటమంటే ఆ కుటుంబాన్ని గుర్తు చేసుకోవాలి. మరి వీళ్లది? తండ్రి ముఖ్యమంత్రి.. కొడుకు ఐటీ మంత్రి.. అల్లుడు సాగునీటి పారుదల మంత్రి.. బిడ్డ ఎంపీ.. తోడల్లుడి కొడుకు రాజ్యసభ సభ్యుడు.. దుర్మార్గుల్లా రాష్ట్రాన్ని దోచుకుతిన్నారు. పదవులను పంచుకొని, వందల ఎకరాల్లో ఫామ్ హౌస్‌లను కట్టుకొన్న మీరు గాంధీ కుటుంబం గురించి మాట్లాడతారా?” అంటూ రేవంత్‌రెడ్డి నిప్పులు చెరిగారు.“ఇది రాజకీయ వేదిక కాదు. రాజకీయపరమైన అంశాలు ప్రస్తావించడం నాకు పెద్దగా ఇష్టం లేదు. కానీ జరుగుతున్న పరిణామాలు, కొందరు మాట్లాడుతున్న మాటలను దృష్టిలో ఉంచుకొని.. గాంధీ కుటుంబం గురించి చిల్లరమల్లరగా మాట్లాడుతున్న వారికి.. అడ్డగోలుగా ఆస్తులు సంపాదించి వేల కోట్లు కూడబెట్టుకున్న వాళ్లకు.. త్యాగం అంటే గుర్తు చేయాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిగా నాపై ఉంది. మోతీలాల్ నెహ్రూ వేల కోట్ల రూపాయల సంపదను జాతికి అంకితం చేశారు. ఆయన వారసుడు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఉన్నత విద్యను అభ్యసించి.. స్వదేశానికి వచ్చి.. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని.. జైలు జీవితం గడిపారు. దేశ తొలి ప్రధానిగా నెహ్రూ బాధ్యతలు చేపట్టారంటే.. అది వారసత్వంగా వచ్చింది కాదు. స్వాతంత్ర్యం కోసం సర్వం త్యాగం చేసిన కుటుంబం వారిది. ఇందిర హయాంలో బ్యాంకుల జాతీయీకరణ, రాజభరణాల రద్దు, దళితులు, బడుగులకు లక్షల ఎకరాల భూముల పంపిణీ, పేదలకు సొంతిళ్లు.. తదితర సంక్షేమ కార్యక్రమాలను అమలుచేశారు. ఈ దేశం కోసం.. తుదిశ్వాస విడిచే వరకూ త్యాగం చేసింది ఇందిరమ్మ కాదా? ఆమె మరణానంతరం నాయకత్వ సమస్య వచ్చినప్పుడు.. దేశప్రజల కోసం ప్రధానిగా రాజీవ్‌గాంధీ బాధ్యతలు చేపట్టారు. దేశ భవిష్యత్ యువత చేతుల్లో ఉందని నమ్మిన ఆయన.. 21 ఏళ్ల ఓటుహక్కును రాజ్యాంగ సవరణ చేసి.. 18 ఏళ్లకే ఓటుహక్కు కల్పించారు. పంచాయతీలకు నేరుగా కేంద్రం నుంచి నిధులు వచ్చేలా చట్ట సవరణ చేసింది.. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించిన మహిళా పక్షపాతి రాజీవ్ కాదా? ఐదేళ్లు తమ ప్రభుత్వంలో ఒక్క మహిళకు కూడా మంత్రి పదవి ఇవ్వని వాళ్లకు మహిళా ఆత్మగౌరవం గురించి ఎందుకు గుర్తుంటుంది? దేశాన్ని 21వ శతాబ్దంలోకి నడపాలంటే.. కంప్యూటర్ యుగం రావాలనే సంకల్పంతో.. సాంకేతిక విప్లవాన్ని దేశానికి పరిచయం చేసిందే రాజీవ్‌గాంధీ. ఒకాయన(కేటీఆర్‌ను ఉద్దేశించి) రోజూ ‘ఎక్స్’లో పోస్టులు పెడుతున్నారు. అమెరికాకు వెళ్లి సాఫ్ట్‌వేర్ విద్య చదివా అంటున్నారు. కంప్యూటర్‌ను దేశానికి పరిచయం చేసిందే రాజీవ్‌గాంధీ. అందువల్లే ఐటీ మంత్రివి అయ్యావు. వెయ్యి ఎకరాల్లో మీరు(కేసీఆర్) ఫామ్ హౌస్ ఏర్పాటుచేసుకున్నారు. 100 ఎకరాల్లో ఆయన(కేటీఆర్) జన్వాడలో ఫామ్ హౌస్ కట్టుకున్నారు.. పది ఎకరాల్లో ప్రగతిభవన్ పేరు మీద గడీని నిర్మించుకున్నారు. వాస్తు చక్కగా లేదని కొత్త సచివాలయం కట్టుకున్నారు.. రూ.లక్ష కోట్లు దిగమింగి.. కాళేశ్వరం నిర్మించారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టడానికి మీకు పదేళ్లు సరిపోలేదా? మేం ఇక్కడ రాజీవ్‌గాంధీ విగ్రహం అనగానే.. తెలంగాణ తల్లి గుర్తొచ్చిందా? ఆయన(కేసీఆర్) తన సొంత విగ్రహం పెడదామని స్థలాన్ని రిజర్వు చేసి పెట్టుకున్నారు.తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టాలని నిర్ణయించాం. అధికారం పోయిందన్న విషయం ఇంకా ఆయన (కేసీఆర్)కు అర్థం కావడం లేదు. కొందరితో మన గురించి మాట్లాడిస్తున్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి. ఈ కాలకేయ ముఠా మళ్లీ గ్రామాల మీదకు రాబోతోంది. మిడతల దండై తెలంగాణను కబళించాలని కుట్రలు చేస్తోంది. ఈ మిడతల దండును పొలిమేర దాటే వరకూ తరమాల్సిన బాధ్యత మీది.. నాది.. అందరం కలిసికట్టుగా ఆ బాధ్యతను తీసుకుందాం” అని రేవంత్ పిలుపునిచ్చారు.

## వేడుకగా విగ్రహావిష్కరణ



రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణ కార్యక్రమం వేడుకగా జరిగింది. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ సలహాదారులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి దీపా దాస్‌మున్షీ, పార్టీ నేతలు, కార్యకర్తలు, సీఎస్ శాంతికుమారి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాజీవ్‌గాంధీ కాంస్య విగ్రహాన్ని రూపొందించిన శిల్పి రమణారెడ్డిని సీఎం సన్మానించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. “దేశాన్ని 21వ శతాబ్దం దిశగా నడిపించిన మార్గదర్శి రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఇక్కడ ఏర్పాటు చేసుకోవడం ఆనందంగా ఉంది” అని అన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. “దేశ ఐక్యత కోసం ప్రాణాలు వదిలిన నాయకుడు రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని చూస్తుంటే.. సజీవంగా ఉన్నట్లు అనిపిస్తుంది. ఈ విగ్రహాన్ని ఇక్కడ పెట్టడాన్ని కొందరు విమర్శిస్తున్నారు. మా నాయకుడిపై మాట్లాడిన మాటలకు కేటీఆర్ క్షమాపణలు చెప్పాలి” అని డిమాండ్ చేశారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. “18 ఏళ్లు నిండి ఓటుహక్కు పొందిన ప్రతి ఒక్కరి మదిలో రాజీవ్‌గాంధీ ఉంటారు” అని పేర్కొన్నారు.

# తెలంగాణ అస్తిత్వం తాకట్టు

(మొదటి పేజి తరువాయి)

తెలంగాణ తల్లిని అవమానించేలా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన చర్యను ఎక్కడికక్కడ పార్టీ శ్రేణులతో సహా తెలంగాణ వాదులంతా వ్యతిరేకిస్తూ నిరసన తెలుపాలని కోరారు. తెలంగాణ తల్లి విగ్రహం ఉండాల్సిన చోట రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయటమేమి అంటూ మొత్తం తెలంగాణ సమాజమంతా తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. వెంటనే రేవంత్ రెడ్డి తాను చేసిన తప్పును సరిదిద్దుకోవాలని సూచించారు. లేదంటే కచ్చితంగా తెలంగాణ ప్రజలు సరైన సమయంలో బుద్ధి చెప్పటం ఖాయమని హెచ్చరించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ గాంధీ విగ్రహాన్ని పెట్టుకోవాలనుకుంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని%ా%కానీ తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన స్థలంలో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయటాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని కెటిఆర్ చెప్పారు. తెలంగాణ సచివాలయం, అమరజ్యోతి మధ్యలో తెలంగాణ తల్లి విగ్రహం ఉండాలని కెసిఆర్ 2023 జులైలోనే ఈ స్థలాన్ని ఎంపిక చేశారని గుర్తు చేశారు. యావత్తు తెలంగాణ సమాజం కూడా తెలంగాణ తల్లి విగ్రహాన్ని సగర్వంగా గౌరవించుకునేందుకు కెసిఆర్ ఎంపిక చేసిన స్థలానికి ఆమోదముద్ర వేసిందన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం కుసంస్కారంతో తెలంగాణ ఉద్యమానికి సంబంధం లేని వ్యక్తి విగ్రహాన్ని ఆ స్థలంలో ఏర్పాటు చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ చర్య ప్రతి తెలంగాణ వ్యక్తి మనసును గాయపర్చేలా ఉందని పేర్కొన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ తల్లి విగ్రహం కోసం కేటాయించిన ఆ స్థలంలో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తొలగిస్తామని, సకల మర్యాదలతో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని గాంధీ భవన్‌కు తరలిస్తామని తేల్చి చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లో తెలంగాణ తల్లి విగ్రహం కోసం ఏర్పాటు చేసిన స్థలంలో తెలంగాణ తల్లి విగ్రహం ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టి ఢిల్లీకి బానిసత్వం చేస్తారని తాము ముందునుంచే చెప్పామని కెటిఆర్ గుర్తు చేశారు. తెలంగాణ అస్తిత్వం, తెలంగాణ ప్రజల ప్రయోజనాల కన్నా కూడా కాంగ్రెస్ నాయకులకు స్వప్రయోజనాలే ముఖ్యమైపోయాయని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమకారులమంటూ గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ నాయకులంతా ఢిల్లీకి గులామ్ లేనని తేలిపోయిందన్నారు. తెలంగాణ ప్రజలా..? ఢిల్లీ బాసులా..? అంటే కాంగ్రెస్ నాయకులంతా ఢిల్లీ బాసులకే జీ హుజూర్ అంటారన్న విషయం మరోసారి స్పష్టమైందని అన్నారు. తెలంగాణ అస్తితత్వంతో పెట్టుకున్న వాళ్లెవరు రాజకీయంగా బతికి బట్టకట్టలేదని ఈ సందర్భంగా కెటిఆర్ హెచ్చరించారు. తెలంగాణ అస్తిత్వం, తెలంగాణ ప్రయోజనాల విషయంలో బిఆర్ఎస్ మాత్రమే రాజీలేని పోరాటం చేస్తుందని అన్నారు. ఢిల్లీ బాసుల మెప్పు కోసం కాకుండా%ా%.తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం బిఆర్ఎస్ ముందు నిలబడుతుందని పేర్కొన్నారు. కచ్చితంగా తెలంగాణకు బిఆర్ఎస్ శ్రీరామరక్షగా నిలుస్తుందని కెటిఆర్ స్పష్టం చేశారు.

## రేషన్‌కార్డులకు అక్టోబర్‌లో దరఖాస్తులు

(మొదటి పేజి తరువాయి)

ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ నేపథ్యంలో కొత్త రేషన్ కార్డులు,హెల్త్ కార్డులు జారీపై విధి విధానాలు, ప్రస్తుతం ఉన్న పరిస్థితులు, నిబంధనలు, ఏ విధంగా సా ఫీగా ముందుకు వెళ్లాలన్న అంశాలపై ఉపసంఘం సమావేశంలో చర్చించామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. కొత్త రేషన్ కార్డులకు సంబంధించి అక్టోబర్ మాసంలో లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని ప్రకటించారు. రేషన్ కార్డుల జారీకి సంబంధించి తుది పక్రియ, ఖరారు ఈ నెలాఖరులో పూర్తి చేస్తామని చెప్పారు. ప్రస్తుతం రా ష్ట్రంలో 89.96 లక్షల రేషన్ కార్డులు ఉండగా, లబ్ధిదారులు 2 కోట్ల 81 లక్షల 70 వేల మంది ఉన్నారని వివరించారు. అర్హులైన ప్రతి కుటుంబానికీ రేషన్ కార్డులు, హెల్త్ కార్డులు జారీ చేస్తామని మంత్రి ఉత్తమ్ భరోసా ఇ చ్చారు.ఈ నెల 21న మరో సారి మంత్రివర్గ ఉపసంఘం సమావేశం కానుందని తెలిపారు. రేషన్ కార్డులు పొం దేందుకు అర్హతలు వార్షిక ఆదాయం గ్రామాల్లో రూ.1. 50లక్షలు , పట్టణాల్లో రూ.2లక్షలు లోపు ఉండాలని , అదే విధంగా పొలం నీటిపారుదల కింద అయితే 3.5ఎకరాలు, వర్షాధారంగా అయితే 7.5ఎకరాలు లోపు ఉం డాలని , ఈ నిబంధనలను పరిశీలన చేస్తున్నట్టు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు.

## 18న ఎన్‌పీఎస్ వాత్సల్య స్కీమ్

### ప్రారంభించనున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 18 ఏళ్లలోపు పిల్లలకు స్పెషల్ బెనిఫిట్స్




న్యూఢిల్లీ,, సెప్టెంబర్ 16,(జర్నలిస్ట్ వార్త):తమ పిల్లల భవిష్యత్ కోసం దీర్ఘకాలం పెట్టుబడి పెట్టాలనుకునే వారి కోసం బడ్జెట్‌లో ప్రకటించిన ఎన్‌పీఎస్ వాత్సల్యను కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ఈనెల 18న ప్రారంభించనున్నారు.

పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ, కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి, ఆర్థిక శాఖ అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నట్లు సమాచారం. ఈ పథకం ప్రారంభించి దాని విధివిధానాలు వెల్లడించనున్నారు. 18 ఏళ్లలోపు బాలబాలికల పేరుతో తల్లిదండ్రులు/సంరక్షకులు ఎన్‌పీఎస్ వాత్సల్య ఖాతా తీసుకోవచ్చు.పిల్లలు మేజర్లు అయ్యాక ఈ ఖాతా సాధారణ ఎన్‌పీఎస్ ఖాతాగా మారుతుందని జూలైలో ప్రకటించిన బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. దేశంలోని ప్రజలందరికీ సామాజిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో 2004లో తీసుకొచ్చిన ఎన్‌పీఎస్.. పన్ను ప్రయోజనాలతో పాటు, దీర్ఘకాలిక పెట్టుబడి పథకంగా బాగా ప్రాచుర్యం పొందింది. దీనిని ఇప్పుడు మరింత విస్తరిస్తూ మైనర్లకు వాత్సల్యను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. కాగా సుకన్య సమృద్ధి యోజన, పీపీఎఫ్ వంటి మదుపు పథకాలకు ఇది అదనం. ఎన్‌పీఎస్ వాత్సల్య వల్ల ముందుగానే పెట్టుబడులు ప్రారంభించడానికి వీలు పడుతుంది.దీనివల్ల చక్రవడ్డీ ప్రయోజనాన్ని పొందవచ్చు.మైనర్లుగా ఉన్నప్పుడే ఎన్‌పీఎస్ ఖాతా తెరవడం వల్ల రిటైర్మెంట్ నాటికి పెద్ద మొత్తంలో కార్పస్ సమకూరుతుంది. ఎన్‌పీఎస్ వాత్సల్య ఖాతా వల్ల చిన్నతనం నుంచే తమ పిల్లలకు పొదుపు అలవాటు చేయొచ్చు. సాధారణంగా ఎన్‌పీఎస్‌లో టైర్-1, టైర్-2 ఖాతాలుంటాయి. టైర్-1 ప్రాథమిక పింఛను ఖాతా. ఇందులో చేరినప్పుడు ఉపసంహరణలపై కొన్ని పరిమితులు ఉంటాయి. టైర్-2లో స్వచ్ఛంద పొదుపు పథకంలాంటిది. ఎన్‌పీఎస్‌లో పెట్టుబడిపై సెక్షన్ 80సీసీడీ కింద రూ.50,000 వరకు పన్ను మినహాయింపు లభిస్తుంది. ఇది సెక్షన్ 80సీ పరిమితి రూ.1,50,000కు అదనం. పదవీ విరమణ తర్వాత (60 ఏళ్లు) ఎన్‌పీఎస్ నిధిలో 60 శాతాన్ని ఒకేసారి వెనక్కి తీసుకోవచ్చు. మిగతా 40 శాతంతో తప్పనిసరిగా యాన్యుటీ పథకాలను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. దీని ద్వారా పదవీ విరమణ తర్వాత పింఛను పొందేందుకు వీలవుతుంది.


## 40వేల మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యం

(మొదటి పేజి తరువాయి)




గుజరాత్ రాష్ట్రం గాంధీ నగర్‌లోని మహాత్మా మందిర్ కన్వెన్షన్ అండ్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన ప్రారంభమైన నాలుగో ప్రపంచ గ్రీన్ పవర్ పెట్టుబడిదారుల సభలో భట్టి పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో గ్రీన్ పవర్ ఉత్పత్తికి ఉన్న మార్గాలు.. రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వివరించారు. రాబోయే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) సిటీ, ఫోర్త్ సిటీ, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌ను ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. ఇంటెలిజెన్స్ సిటీ, ఫ్యూచర్ సిటీ సుస్థిర సాంకేతికత చుట్టూ రాష్ట్రాభివృద్ధి కేంద్రీకృతమై ఉంది. కీలక పారిశ్రామిక కారిడార్లను అనుసంధానం చేయడానికి ప్రాంతీయ రింగ్ రోడ్డు, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌ను ముందుకు తీసుకెళ్లనున్నట్టు చెప్పారు. రాష్ట్రంలో రెండు ప్రధాన హైడ్రో ప్రాజెక్టులు ఉన్నాయని, ఇక్కడ పంప్డ్ స్టోరేజ్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపట్టడానికి ఇంకా అవకాశాలు ఉన్నాయని తెలిపారు. సోలార్ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపే వారంతా హైదరాబాద్‌కు రావాలని డిప్యూటీ సీఎం కోరారు.

## ఏపీ, తెలంగాణలకు రెండు వందేభారత్ రైళ్లను ప్రారంభించిన ప్రధాని మోదీ



న్యూఢిల్లీసెప్టెంబర్ 16,(జర్నలిస్ట్ వార్త): తెలుగు రాష్ట్రాలకు రెండు వందేభారత్ రైళ్లను ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఏపీ నుంచి దుర్గ్-విశాఖపట్నం వందేభారత్ రైలు, తెలంగాణ నుంచి నాగపూర్-సికింద్రాబాద్ రైలును ప్రారంభించారు.దుర్గ్-విశాఖపట్నం వందేభారత్ రైలు... దుర్గ్ నుంచి వారానికి ఆరు రోజులు (గురువారం మినహా) ఉదయం 5.45 గంటలకు బయలుదేరుతుంది. అదేరోజు మధ్యాహ్నం 1.45 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. విశాఖ నుంచి మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభమై, రాత్రి 10.50 గంటలకు దుర్గ్‌కు చేరుకుంటుంది. ఈ నెల 20వ తేదీ నుంచి ఈ రైలు రెగ్యులర్‌గా తిరగనుంది.సికింద్రాబాద్-నాగపూర్ వందేభారత్ రైలు ఈ నెల 19వ తేదీ నుంచి అందుబాటులోకి రానుంది. మంగళవారం మినహా మిగతా ఆరు రోజులు ఈ రైలు నడుస్తుంది. ఈ రైలు ప్రతిరోజు ఉదయం 5.00 గంటలకు నాగ్‌పూర్ నుంచి బయలుదేరి సేవాగ్రామ్, చంద్రాపూర్, బల్లార్షా, రామగుండం, కాజీపేట మీదుగా సికింద్రాబాద్‌కు మధ్యాహ్నం 12.15 గంటలకు చేరుకుంటుంది. మధ్యాహ్నం 1 గంటలకు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి రాత్రి రాత్రి 8.20 గంటలకు నాగపూర్ చేరుకుంటంది. మహారాష్ట్ర-తెలంగాణ మధ్య ఇదే తొలి వందేభారత్ రైలు. అంతేకాదు, దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఇదే అతిపెద్ద వందేభారత్ రైలు. దీంట్లో 20 కోచ్ లు ఉంటాయి.

# గణనాధుడి నిమజ్జనం ప్రశాంతం



### - నిమజ్జనం ప్రాంతాల్లో భారీ ఏర్పాట్లు

**: నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి**
**-జిల్లా కలెక్టర్ డా సత్య శారదా, బల్దియా కమీషనర్ డా.అశ్విని తానాజీ వాకడేలతో కలిసి నిమజ్జన వేడుకలు ప్రారంభించిన మేయర్....**







**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 16,(జర్నలిస్ట్ వార్త):**

వరంగల్ జిల్లాలో గణనాధుడి నిమజ్జనం ప్రశాంతంగా సాగింది. నిమర్జనం ప్రాంతాల్లో భారీగా ఏర్పాట్లు చేసినట్లు నగర మేయర్ గుండు సుధారాణి తెలిపారు. సోమవారం వరంగల్ జిల్లా పరిధి చిన్న వడ్డేపల్లి చెరువు వద్ద జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి, బల్దియా కమీషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాఖేడే లతో కలిసి గణేష్ నిమజ్జన వేడుకలను మేయర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ బల్దియా వ్యాప్తంగా 23 చెరువుల్లో నిమజ్జనం వేడుకల కోసం క్రేన్ల ను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. సుమారు కోటి రూపాయలు వెచ్చించి, ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. జిల్లా మంత్రి సహకారంతో జిడబ్ల్యూఎంసి, రెవిన్యూ, ఇరిగేషన్, పోలీస్ విభాగాలను సమన్వయం చేస్తూ, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లతో పాటు బల్దియా కమిషనర్లు నిమజ్జనం కోసం విస్తృత ఏర్పాట్లు చేశామని తెలిపారు. నగరమంతా శోభాయ మానంగా నిమజ్జనం వేడుకలకు ముస్తాబు కావడం జరిగిందన్నారు. నేడు (మంగళ వారం) సాయంత్రం వరకు సుమారుగా 6 వేల విగ్రహాలు నిమజ్జనం జరిగే అవకాశం ఉందని తెలిపారు. మట్టి ప్రతిమలను ప్రతిష్టించాలని ప్రజలకు ఇప్పటికే అవగాహన కల్పించామన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పిసిబి) నుండి మంత్రి ద్వారా మట్టి ప్రతిమలను పంపిణీ చేసినట్లు తెలిపారు. వాటిని జీడబ్ల్యూఎంసి ద్వారా అందజేశామని, భవిష్యత్తులో మట్టి విగ్రహాలు ప్రతిష్టించేలా, చెరువులు కలుషితం కాకుండా చూడవచ్చని భక్తులను కోరడం జరుగుతుందని తెలిపారు. నిమజ్జన అనంతరం చెరువుల్లో వినాయక ప్రతిమల అవశేషాలు తొలగించడం బల్దియాకు ఛాలెంజ్ లాంటిదని, వాటిని తొలగించడం జరుగుతుందని అన్నారు. బతుకమ్మ వేడుకలు ఉంటాయని, ఈ పండుగలు పూర్తి అయిన తర్వాత యాక్షన్ ప్లాన్ తయారు చేసుకొని, చెరువుల్లో పూడిక తీత చేపట్టి శుభ్రం చేయడం జరుగుతుందన్నారు. నీటి నిల్వలు ఎక్కువగా ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని, ఇప్పటికే గజ ఈతగాళ్లతో పాటు డిఆర్ఎఫ్ సిబ్బందిని అందుబాటులో ఉంచడం జరిగిందని మేయర్ తెలిపారు.

**వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి మాట్లాడుతూ**
జిల్లా పరిధిలో 9 ప్రధాన చెరువుల్లో నీటి నిల్వలు అధికంగా ఉన్నందున జీడబ్ల్యూఎంసికి చెందిన డిఆర్ఎఫ్ సిబ్బందితో పాటు 59 మంది గజ ఈత గాళ్ళను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందన్నారు. ఫిషరీస్, ఇరిగేషన్, పోలీసు, రెవెన్యూ , బల్దియా అధికారులతో పటిష్ట ఏర్పాట్లు చేశారని చెప్పారు. మంగళవారం ఉదయం వరకు నిమజ్జనాలు కొనసాగే అవకాశం ఉందని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని చర్యలు చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజాపాలన దినోత్సవ వేడుకల ఏర్పాట్లు సమర్ధవంతంగా నిర్వహించాలి

**- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి**

వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 16,(జర్నలిస్ట్ వార్త): వరంగల్ పట్టణం ఓ సిటీ ఎదురుగా ఐడిఓసి మైదానంలో నేడు తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలు జరగనున్నాయి. ఈ ఏర్పాట్లను సోమవారం వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి, డిసిపి రవీందర్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి పరిశీలించారు.సభా వేదిక వివిధ, సీటింగ్, తదితర ఏర్పాట్లను వారు పరిశీలించి, ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా జాతీయ పతాకం ఎగురవేయడానికి రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిధిగా హాజరవుతారని కలెక్టర్ తెలిపారు. నేడు ఉదయం 9: 45 నిమిషాలకు, ఖిలా వరంగల్ లోని అమరవీరుల స్తూపం వద్ద, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించినున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి ప్రారంభించే ప్రభుత్వ ఎంజీఎం ఆసుపత్రిలో ఎస్డిఎఫ్ బ్లడ్ బ్యాంక్ కౌంటర్, పిఎంఎస్ఎస్ వై ఆసుపత్రిలో డయాలసిస్ ఫెసిలిటీ సెంటర్, బల్దియా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జంక్షన్ ప్రారంభోత్సవ ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కృష్ణవేణి తహశీల్దార్లు ఇక్బాల్, నాగేశ్వర్ రావు, మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్, సంబందిత శాఖల అధికారులు పాల్గొన్నారు

## గణేష్ మండపంలో గుండెపోటుతో టెకీ మృతి



హైదరాబాద్, సెప్టెంబర్ 16,(జర్నలిస్ట్ వార్త): హైదరాబాద్‌లోని మణికొండ పరిధి అలకాపురి టౌన్‌షిప్‌లో విషాదం చోటుచేసుకుంది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ శ్యామ్ ప్రసాద్ గుండెపోటుతో మృతిచెందారు.టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన గణేష్ ఉత్సవ కమిటీ లడ్డూ వేలం పాటలో ఉత్సాహంగా పాల్గొన్న అతడు.. ఇంటికి వెళ్లి ఒక్కసారిగా కుప్పకూలి ప్రాణాలు కోల్పోయడు .ఆదివారం రాత్రి గణేష్ మండపం వద్ద శ్యామ్ ఉత్సాహంగా లడ్డూ వేలంలో పాల్గొన్నారు. చాలాసేపు నృత్యాలు చేస్తూ గడిపారు. రూ.15 లక్షల వరకు వేలం పాడారు. ఆ తర్వాత స్నేహితుడు లడ్డూను కైవసం చేసుకోవడంతో అతడి ముందు ఉత్సాహంగా తీన్మార్ స్టెప్పులేశారు. అనంతరం ఇంటికి వెళ్లి కుప్పకూలి చనిపోయారు. దీంతో కుటుంబసభ్యులు, కాలనీవాసులు విషాదంలో మునిగిపోయారు.


## వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలో కాలం చెల్లిన మందులు కలకలం

**- ఆ మందులను గుర్తించిన జరపీడితుడు అశోక్**





వర్ధన్నపేట, సెప్టెంబర్ 16,(జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం కాలం చెల్లిన మందులు కలకలం రేపాయి. కాలం చెల్లిన మందులు వేసుకున్న ఓ వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే రాయపర్తి పట్టణ కేంద్రానికి చెందిన అశోక్ 50: సంవత్సరాలు అనే వ్యక్తి అనారోగ్య సమస్యలతో ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్ళారు. జ్వరం సమస్యలు చికిత్స కోసం వెళ్ళిన అతన్ని పరీక్షించిన వైద్యులు కాలం చెల్లిన మందులను ఇచ్చి, బాధితుని సమస్యను మరింత పెంపొందించారు. అనారోగ్య సమస్యను డాక్టర్లతో బుక్ చేసిన కాలం చెల్లిన మాత్రలను వేసుకున్నారు. అవి వేసుకున్న బాధితుడు మరింత తీవ్ర అస్వస్థతకు గురైనారు. కాలం చెల్లిన మందులు వేసుకోవడం వల్లే ఇలా జరిగిందని బాధితుని తరుపు బంధువులు వాపోయారు. ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లే స్తోమత లేకే, ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన తమ ప్రాణాలతో వైద్యులు చెలగాటమాడారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రి వైద్యులు వ్యవహరించిన తీరుపై బాధితుడి బంధువులు ఆందోళనలకు దిగారు. కాలం చెల్లిన మందులు ఇచ్చిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని, ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. గతంలో వైద్యులు ముప్పై పడకల పడకల సామర్థ్యం ఉన్నప్పుడే ఆసుపత్రిలో 250 పైగా




ప్రసవాలు చేసేవారు. ప్రస్తుతం 60 పడకలకు రెట్టింపు స్థాయిలో పెరిగిపోయింది. రోజురోజుకు ప్రసవాల శాతం పడిపోవడంపోవడమే కాకుండా, ఇక్కడ వైద్యులు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రోగులను ఇతర ఆసుపత్రులకు పంపిస్తున్నారని వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఆసుపత్రి నిర్వహణపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కలెక్టర్ సృష్టి సారించాలని గాడిలో పెట్టాలలని బాధితులు కోరుతున్నారు.

## ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ పేద ప్రజలకు అండగా నిలుస్తుంది




రాయపర్తి, సెప్టెంబర్ 16,(జర్నలిస్ట్ వార్త): సహాయ సహకారాలు అందిస్తూ, ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ పేదలకు అండగా నిలుస్తుంది. నిరుపేద ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించడమే ధ్యేయంగా తమవంతు సహకారం అందిస్తున్నట్లు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ మేనేజింగ్ డైరెక్టర్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కేశవాపురంలో వినాయక మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, పలువురికి భోజనం వడ్డించారు. అనంతరం కొండూరు గ్రామానికి చెందిన చిన్నపల్లి సుశీల, రమేష్, తిరుమలాయపల్లికి చెందిన నర్సింహా రాములు, మహబూబ్ నగర్ కు చెందిన కంజర్ల యాదమ్మ, ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ సమాచారం తెలుసుకున్న ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పరుపాటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పార్టీలకతీతంగా పేదలకు సహాయం చేస్తున్నట్లు తెలిపారు. అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న ఆయనను పలువురు గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమాలలో ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు లేతాకుల మధుకర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, కొత్వాలు దేవేందర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి,లేతాకుల మహేందర్ రెడ్డి,జినుగు అనిమి రెడ్డి, కర్ర రవీందర్ రెడ్డి, గాదె రవీందర్ రెడ్డి, సురేందర్ రాథోడ్, వల్లాల సుధాకర్, వశపాక కుమార్, గజవెల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు గంగ ఒడిలోకి గణపయ్య

హైదరాబాద్, సెప్టెంబర్ 16,(జర్నలిస్ట్ వార్త):
గ్రేటర్ హైదరాబాద్‌లో మంగళవారం జరుగనున్న వినాయక నిమజ్జనానికి అధికార యంత్రాంగం సర్వం సిద్ధంచేసింది. ఖైరతాబాద్ గణపతికి ఉ. 6.30గం.లకు ప్రత్యేక పూజలు. మ.1.30 గం.లకు క్రేన్ నంబర్ 4 వద్ద ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం జరుగనుంది. హుస్సేన్‌సాగర్ వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాం గం. హైదరాబాద్ నగరంలో పోలీసులు 25వేల మం ది బందోబస్తు ఏర్పాటు చేశారు. సిసి కెమెరాలు ఏర్పా టు చేయడంతో పాటు పలు ప్రాంతాల్లో మౌంటెడ్ కెమెరాలతో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది హుస్సేన్‌సాగర్‌లో 25 వేల నుంచి 30 వేల విగ్రహాలు నిమజ్జనమవుతాయని అధికారులు అంచనా వేస్తున్నా రు. ఖైరతాబాద్ గణేశుడి విగ్రహాన్ని మధ్యాహ్నం 1. 30 గంటలలోపు నిమజ్జనం చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.
సాయంత్రం 4 గంటల ప్రాంతం లో బాలాపూర్ వినాయకుడు హుస్సేన్ సాగర్ దగ్గరికి చేరుకునే అవకాశముంది. మహిళల భద్రతకు షీటీమ్స్‌ను రంగంలోకి దించుతున్నారు. హుస్సేన్‌సాగర్ పరిసర ప్రాంతాల్లోనే 12 షీటీమ్స్ పహారా కాయనున్నాయి. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి బుధవారం రాత్రి 11 గంటల వరకు భారీ వాహనాల ను, ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను కూడా నగరంలోని అనుమతించరు. నిమజ్జన సమయంలో నగర వ్యా ప్తంగా పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. మొ త్తం 67 డైవర్షన్ పాయింట్లు ఏర్పాటు చేశారు. ప్ర జలంతా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు వినియోగిస్తే నిమజ్జనం ప్ర శాంతంగా వీక్షించవచ్చని పోలీసు ఉన్నతాధికారు లు సూచించారు. అత్యవసర సమయాల్లో ట్రాఫిక్ హె ల్ప్ లైన్ నంబర్లు 9010203626, 8712660600, 040-27852482 కి ఫోన్ చేయొచ్చని తెలిపారు.

## గ్రేటర్ ఏర్పాట్లు

మొత్తం 15 వేల మంది జీహెచ్ఎంసీ సిబ్బంది మూడు షిఫ్టుల్లో గణేష్ నిమజ్జనంలో పాల్గొంటారు. నగర పరిధిలో 468 క్రేన్స్, హుస్సేన్ సాగర్ వద్దనే 38 క్రేన్స్ ఏర్పాటు చేశారు. నేటి నుంచి మూడు రోజుల పాటు జీహెచ్ఎంసీ సిబ్బంది విధుల్లో ఉంటారు. 160 గణేష్ టీమ్స్ పనిచేయనున్నాయి. హైదరాబాద్ వ్యాప్తంగా 10 కంట్రోల్ రూమ్‌లు, జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూం ఉంటుంది. నిమజ్జనం మరుసటి రోజు అదనంగా మరో 500 మంది సిబ్బంది



పనిచేస్తారు. నగరంలో 73 వినాయక పాండ్స్ అందుబాటులోకి తీసుకొచ్చారు. మూడు రోజులపాటు జీహెచ్ఎంసీ సిబ్బందికి సెలవులు రద్దు చేశారు.

## మంత్రి పరిశీలన

నేడు గణేష్ నిమజ్జనం సంధ్భంగా జిల్లా ఇంఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మిలు లుంబిని పార్క్ నుంచి బోట్ లో వెళ్లి ఖైరతాబాద్ వినాయకుడు నిమర్జనం ఏర్పాట్లు దగ్గర ఉండి పరిశీలించనున్నారు..

## ఖైరతాబాద్ గణపతి శోభాయాత్ర

మంగళవారం ఉదయం 6.30గంటలకు ఖైరతాబాద్ గణపతి శోభాయాత్ర ప్రారంభం కానుంది. ఇక్కడ 700 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. శోభాయాత్ర మార్గంలో 56 సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వీటితో పాటు రహదారిపై ఉన్న సీసీటీవీ కెమెరాలతోనూ భద్రతను పర్యవేక్షించనున్నారు.
బాలాపూర్ వినాయకుడి వద్ద 220 మంది పోలీసులతో భద్రత ఏర్పాటు చేశారు. 30 సీసీటీవీ కెమెరాలతో రాచకొండ పోలీసులు భద్రత ఏర్పాటు చేశారు. వేలంపాట అనంతరం ఉదయం 9 గంటల సమయంలో శోభాయాత్ర ప్రారంభం కానుంది. 16కి.మీ ప్రయాణం అనంతరం ఎన్టీఆర్ మార్గ్కు చేరుకోనుంది.
పోలీసులకు ఆదేశాలు జారీ చేసిన సిఎం రేవంత్‌రెడ్డి ట్యాంక్‌బండ్‌తో పాటు ప్రధాన మండపాలు, చెరువుల వద్ద ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని సిఎం రేవంత్ పోలీసులను ఆదేశించారు. పర్యవేక్షణతో పాటు ప్రతి గంటకు ఒకసారి సిబ్బందికి కమాండ్ కంట్రోల్ నుంచి సూచనలు ఇచ్చి అలర్ట్ చేయాలని సిఎం రేవంత్ సూచించారు. సమస్యాత్మక ప్రాంతాలపై ఎక్కువ దృష్టి పెట్టాలని సిఎం ఆదేశించారు. బ్లైండ్ స్పాట్స్, హాట్ స్పాట్స్‌లకు సంబంధించి రికార్డు మెయింటెన్స్ చేయాలని సిఎం సూచించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. నవరాత్రులు పూర్తి చేసుకున్న గణపయ్యను నిమజ్జనం చేసేందుకు నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

ఈ క్రమంలోనే వినాయక విగ్రహాల నిమజ్జనం ఏర్పాట్లపై సిఎం రేవంత్ రెడ్డి సోమవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పోలీసులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు హైదరాబాద్ సిపి సివి ఆనంద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ట్యాంక్‌బండ్ సహా నగరంలో వినాయక నిమజ్జనాల కోసం ఏర్పాటు చేసిన చెరువుల వివరాలను కమిషనర్ సివి ఆనంద్ సిఎంకు వివరించారు. ఈ క్రమంలోనే గ్రేటర్ వ్యాప్తంగా నిమజ్జనాల పర్యవేక్షణ కోసం ట్యాంక్‌బండ్, మండపాలు, చెరువుల దగ్గర మొత్తం 733 సిసి కెమెరాలతో నిమజ్జన ప్రక్రియను పర్యవేక్షిస్తున్నట్లు సిపి ముఖ్యమంత్రితో తెలిపారు. అలాగే సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి వాటి పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించామని సిపి పేర్కొన్నారు. ఈ క్రమంలోనే వినాయక నిమజ్జనంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని సిఎం రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# అదృష్టం బాగుంటే ఐదేళ్లుంటావు

## సీఎం రేవంత్‌పై హరీష్ రావు ఫైర్

హైదరాబాద్, సెప్టెంబర్ 16,(జర్నలిస్ట్ వార్త):
అబద్ధాలు, అసత్య వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని, అదృష్టం బాగుంటే ఐదేళ్లు అధికారంలో ఉంటారని లేని పక్షంలో ప్రజలే గుణపాఠం చెబుతారని బీఆర్ఎస్ నేత, మాజీమంత్రి హరీష్‌రావు హెచ్చరించారు.పగటికలలతో కాలక్షేపం చేస్తే ప్రయోజనం ఉండదని అన్నారు. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో కాంగ్రెస్ గెలిస్తే ఐదేళ్లలోనే ప్రభుత్వాలు పడిపోయాయని గుర్తుచేశారు. నీఅదృష్టం బాగుంటే ఐదేళ్లు ఉంటావు, మంచిగా పరిపాలించి ప్రజల మనస్సును గెలుచుకో అంటూ హితవు చెప్పారు.రాజకీయ కుట్రలతో వ్యవహరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి గుండెల్లో నిద్రపోతానని, ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు వదిలిపెట్టనని, ఆయన గుండెల్లో నిద్రపోతానని మండిపడ్డారు. దేవుళ్ల మీద ప్రమాణంచేసినా, నీతిమాలి, బాధ్యత మర్చి తిట్ల పురాణం అందుకున్నా పట్టించుకోనని స్పష్టం చేశారు. వెంపలి చెట్టు అంత ఉన్న నీవు నాఎత్తుగురించి మాట్లాడుతావా అంటూ మండిపడ్డారు.బీఆర్ఎస్ ప్రభుత్వం భూములను కాపాడితే రియలెస్టేట్ దందా చేసేందుకు ఫోర్త్ సిటీ, ఫార్మాసిటీ అంటూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన విరుచుకుపడ్డారు. ఆదివారం సీఎం రేవంత్



చేసిన విమర్శలపై స్పందించిన హరీష్‌రావు తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ తీవ్ర విమర్శలు చేశారు.రైతు రుణమాఫీ ఎక్కడ పూర్తిగా అమలైందో చూపిచు వస్తానని హరీష్ రావు సవాల్ చేశారు. ప్రకృతి వైపరీత్యాల వరదలకంటే ముఖ్యమంత్రి అబద్ధాల వరద కంపులో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని దుయ్యబట్టారు. తన ఎత్తుపై పరుష పదజాలంతో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డిపై ఆయన విరుచుకు పడ్డారు. తాను తాటి చెట్టు అంత ఎత్తు ఎదిగినా నువ్వు వెటంపలి చెట్టు అంతా ఎత్తుకూడా ఎదగలేదని ఎద్దేవా చేశారు.సీఎం కుర్చికి మర్యాద దక్కాలంటే మర్యాదగా వ్యవహరించాలనే కనీస పరిజ్ఞానం ఆయనకు లేదన్నారు. సీఎం భాష, వ్యవహర శైలి, నడవడిక మర్యాదగా ఉన్నప్పుడే కుర్చికి మర్యాద లభిస్తుందని,నోరు తెరిస్తే బూతులు, అబద్ధాలు మాట్లాడితే మర్యాద ఎలా వస్తుందని అన్నారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ఎన్నో అబద్దాలు,ఆరోపమలు, విమర్శలు చేశారని హరీశ్‌రావు ధ్వజమెత్తారు.సీఎం రేవంత్ రెడ్డి తన గురించి ఏం మాట్లాడినారో ప్రజలంతా విన్నారని హరీష్ రావు గుర్తు చేశారు. తాటిచెట్టంత పెరిగావు.. దూడకున్నంత మెదడు లేని సన్నాసి ఎక్కడ దాక్కున్నావని సీఎం తనను ఉద్దేశించి అన్నారని, కానీ తను అలా మాట్లాడానికి మర్యాద, సంస్కారం అడ్డు వస్తున్నాయని చెప్పారు. నీవు లిల్లిపుట్ అంత లేవు అని అనలేనా? సన్నాసి అనడం పెద్ద కష్టం కాదని అన్నారు. నా ఎత్తు గురించి దుర్భషలాడుతున్నావు. నా ఎత్తు మీద నీకు అంత ఈర్ష్య ఎందుకు, అది భగవంతుడు ఇచ్చిన వరమని అన్నారు. ఎంత తిట్టినా, ఎంత మాట్లాడినా తన అంత ఎత్తు పెరగలేవని,రేవంత్ రెడ్డికి ఆదశ దాటిపోయిందని హరీష్ రావు అన్నారు.

# స్టాండింగ్ కమిటీల ఏర్పాటు కొలిక్కి

న్యూఢిల్లీ: సెప్టెంబర్ 16,(జర్నలిస్ట్ వార్త): ప్రస్తుత లోక్‌సభకు సంబంధించి వివిధ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీల కూర్పు ఓ కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. లోక్‌సభ పరిధిలోని 16, రాజ్యసభ పరిధిలోని 8 విభాగాల స్టాండింగ్ కమిటీల్లో తమకు కనీసంగా 5 కమిటీలకు ఛైర్మన్ పదవులు ఇవ్వాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తూ వచ్చింది.దీనిపై పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు, న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్‌లు కాంగ్రెస్ నేతలు గౌరవ్ గొగోయ్, కె.సురేశ్, జైరాం రమేశ్ తదితరులతో చర్చించారు.5 కమిటీలతో పాటు, కమిటీల్లో అత్యంత కీలకమైన హోంశాఖను కాంగ్రెస్ కోరింది. అయితే హోంశాఖను అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించలేదు. లోక్‌సభ స్టాండింగ్ కమిటీల్లో మూడింటికి ఓకే చెబుతూనే.. విదేశీ వ్యవహారాలు, గ్రామీణాభివృద్ధి-పంచాయతీరాజ్, వ్యవసాయం వంటి కీలక విభాగాల స్టాండింగ్ కమిటీలకు కాంగ్రెస్ ఎంపీలను ఛైర్మన్‌లుగా నియమించేందుకు అంగీకరించింది. ఇక రాజ్యసభ కమిటీల్లో విద్యా శాఖను అప్పగించేందుకు సుముఖత వ్యక్తం చేసింది. కాంగ్రెస్ పార్టీ వర్గాలు సోమవారం దీన్ని ధృవీకరించాయి.

## రాయికంటి రాందాస్ ఆర్.ఆర్,సింగిరెడ్డి పరమేష్ నాయకత్వంలో నిర్వహించబోతున్న

# ధర్మం గెలిచిన సభ కరపత్రాలను ఆవిష్కరించిన

## మదనాపూర్ మండల మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి.




వనపర్తి సెప్టెంబర్ 16,(జర్నలిస్ట్ వార్త): మధనాపురం మండలం లో ధర్మం కోసం గెలిచిన సభ కరపత్రాలను విడుదల చేసిన నాయకులు సుప్రీంకోర్టు తీర్పు ద్వారా ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ల ఉప వర్గీకరణకు అనుమతి లభించిన సందర్భంగా ఏబిసిడి వర్గీకరణ సామాజిక న్యాయం కోసం చేసిన న్యాయబద్ధమైన పోరాటాన్ని గుర్తించి సుప్రీంకోర్టు ద్వారా వర్గీకరణకు అనుమతులు వచ్చినందున ఈ విజయాని సాధించడం కోసం ఎంతోమంది మాదిగ అమరవీరులు ప్రాణ త్యాగాలను చేశారు మాదిగ అమరవీరులకు ఉద్యమాభి వందనాలు చెల్లిస్తూ అభినందన సభ 24 సెప్టెంబర్ 2024 మంగళవారం రోజు అంబేద్కర్ కళాభవనము మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించే ధర్మం గెలిచిన సభకు అధిక సంఖ్యలో పాల్గొని ఈ సభను జయప్రదం చేయవలసిందిగా కోరుచున్నాము ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఆర్ ఆరు మండల అధ్యక్షులు దుప్పల్లి కురుమూర్తి, వడ్డెర సంఘం నాయకులు వడ్డే కృష్ణ ,గౌడ సంఘం నాయకులు ఏ.మహదేవన్ గౌడ్, జిల్లా మైనార్టీ నాయకులు కాజమైనోదిన్, సాయిబాబా, యువజన నాయకులు మహేష్ ఖాజారాం,నరేష్ నాయక్, మధు,నాగేందర్, రాజు ,పరశురాం, వినోద్,వరుణ్,జి.రాజు ,మహేష్,నాగరాజ,సునీల్ ,అల్లి బాబు,రాజు ,హరి తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాలు

## రేవంత్‌ను కలిసి చెక్కు అందించిన చిరంజీవి

హైదరాబాద్, సెప్టెంబర్ 16,(జర్నలిస్ట్ వార్త): వరద బాధితుల సహాయార్థం పలువురు ప్రముఖులు సాయం అందజేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి ప్రముఖ నటుడు చిరంజీవి రూ.50 లక్షల విరాళం ఇచ్చారు.రామ్ చరణ్ తరపున మరో రూ.50 లక్షల చెక్కులను సీఎం రేవంత్‌కు అందజేశారు.అలాగే అమర్‌రాజా గ్రూప్ తరపున సీఎం సహాయనిధికి మాజీమంత్రి గల్లా అరుణ కుమారి రూ.కోటి విరాళం, సినీ నటులు అలీ రూ.3 లక్షలు, విశ్వక్ సేన్ రూ.10 లక్షలు అందజేశారు. సినీ నటుడు



సాయిధరమ్ తేజ్ రూ.10 లక్షలు, గరుడపల్లి ఇన్‌ఫ్రాస్టక్చర్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ డైరెక్టర్ సంజయ్ గరుడపల్లి రూ.25 లక్షలు ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళంగా ఇచ్చారు.

# యూపీఐ చెల్లింపుల పరిమితి భారీగా పెంపు

## నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కీలక ప్రకటన


హైదరాబాద్, సెప్టెంబర్ 16,(జర్నలిస్ట్ వార్త):అవసరం పడినప్పుడు కూడా ఎక్కువ మొత్తంలో యూపీఐ లావాదేవీలు నిర్వహించలేకపోతున్న యూజర్లకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) గుడ్‌న్యూస్ చెప్పింది. ఎంపిక చేసిన కొన్ని రకాల చెల్లింపులకు లావాదేవీల పరిమితిని ఏకంగా రూ.5 లక్షలకు పెంచింది. పెద్ద మొత్తంలో లావాదేవీలు నిర్వహించే యూజర్లకు మరింత సౌలభ్యం కోసం ఎన్‌పీసీఐ ఈ సవరణ చేసింది. పన్ను చెల్లింపులు, ఆసుపత్రులు, విద్యా సంస్థలకు చెల్లింపులతో పాటు ఐపీవోలు, ఆర్బీఐ రిటైల్ డైరెక్ట్ స్కీమ్‌లలో పెట్టుబడులకు సంబంధించిన లావాదేవీలకు ఈ పరిమితి పెంపు వర్తిస్తుంది. ఇవాళ్టి (సోమవారం) నుంచే ఈ మార్పు అమలులోకి వస్తుందని ఆగస్ట్ 24 నాటి సర్క్యులర్‌లో ఎన్‌పీసీఐ వివరించింది.కాగా ఇంతకాలం యూపీఐ లావాదేవీల గరిష్ఠ పరిమితి రోజుకు ఒక లక్ష రూపాయలు మాత్రమే ఉండేది. అయితే క్యాపిటల్ మార్కెట్‌లు, ఇన్సూరెన్స్‌లు, విదేశీ చెల్లింపులకు గరిష్ఠ పరిమితి రూ.2 లక్షలుగా ఉంది. కాగా రూ.5 లక్షల వరకు ఎవరైనా చెల్లింపులు చేస్తే ఆ లావాదేవీలను బ్యాంక్‌లు, పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లు, యూపీఐ యాప్‌లు అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది.

# ముసాయిదానే.. కొత్త చట్టం!

(మొదటి పేజి తరువాయి)
ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే ఈనెల 20న జరిగే కేబినెట్ సమావేశం ముందుకు ఆర్డినెన్స్ వచ్చే అవకాశం లేదని అంటున్నాయి. అయితే కేబినెట్ ఎజెండాపై బుధవారం స్పష్టత వస్తుందని, ఎజెండాలో భూముల చట్టం ఆర్డినెన్స్ ఉంటే రూపకల్పన, జారీ ఏర్పాట్లకు సిద్ధంగానే ఉన్నామని రెవెన్యూ వర్గాలు వెల్లడించాయి.

ముసాయిదా బిల్లు ఇదే..
అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో భాగంగా ఈ ఏడాది ఆగస్టు 2న రాష్ట్ర ప్రభుత్వం 'ఆర్‌వోఆర్-2024' ముసాయిదాను అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. ఆర్‌వోఆర్-2020 చట్టంలో పరిష్కరించలేని అనేక సమస్యలకు పరిష్కారం చూపుతూ 20 సెక్షన్లతో ఈ ముసాయిదా చట్టాన్ని రూపొందించింది. 1936, 1948, 1971, 2020 నాటి ఆర్ఓఆర్ చట్టాలను పరిశీలించి, వాటి అమలుతో చేకూరిన ఫలితాలను బేరీజు వేసి కొత్త చట్టం ముసాయిదాను తయారు చేసింది.
తెలంగాణలో ఆర్‌వోఆర్ చట్టాల అమలు చరిత్ర, ప్రస్తుత సమస్యలు, రాబోయే అవసరాల అంచనాల ప్రకారం రూపొందించిన ఈ ముసాయిదాలో పాస్ పుస్తకాలు రాని భూముల సమస్యల పరిష్కారం, కొత్త రికార్డును ఎప్పుడైనా తయారు చేసుకునే అధికారాన్ని కల్పించడం, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, భూఆధార్, ఆబాదీలకు ప్రత్యేక హక్కుల రికార్డు, అప్పీల్, రివిజన్ లాంటి వెసులుబాట్లు కల్పిస్తూ అనేక అంశాలను ముసాయిదాలో పొందుపరిచారు.
తెలంగాణ ఏర్పాటైన తర్వాత ఆర్‌వోఆర్ చట్టానికి రెండోసారి మార్పు జరుగుతోంది. 2020లో బీఆర్ఎస్ హయాంలో ఆర్‌వోఆర్-2020 చట్టం అమల్లోకి తెచ్చారు. అందులోని అనేక అంశాలకు సవరణలు, మార్పు చేర్పులతో ఆర్‌వోఆర్-2024ను కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ముందు పెట్టింది. ముసాయిదాపై ఈ ఏడాది ఆగస్టు 2 నుంచి 23 వరకు ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించింది. మంత్రులు, రెవెన్యూ శాఖ సీనియర్ అధికారులు, భూచట్టాల నిపుణులు, మేధావులు, సామాన్యులు.. ఇలా అన్ని వర్గాలు అభిప్రాయాలు స్వీకరించింది. ఈ వివరాలతో జిల్లాల కలెక్టర్లు నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపారు.

# వివాహ బంధంతో ఒక్కటైన
## నటుడు సిద్దార్థ్ , నటి అదితిరావు హైదరీ






నటుడు సిద్దార్థ్ , నటి అదితిరావు హైదరీ తాజాగా వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. ఇరు కుటుంబాల పెద్దల సమక్షంలో వనపర్తిలోని దేవాలయంలో వీరి వివాహం జరిగింది. దీనికి సంబంధించిన ఫొటోలను సోషల్‌మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు. నువ్వే నా సూర్యుడు.. నువ్వే నా చంద్రుడు.. అలాగే నువ్వే నా తారాలోకం. మిసెస్ అండ్ మిస్టర్ అదు సిద్ధు‘ అని అదితి క్యాప్షన్ జత చేశారు. ప్రస్తుతం ఈ ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. నూతన జంటకు నెటిజన్లు శుభాకాంక్షలు చెబుతున్నారు. సిద్దార్థ్‌తో రిలేషన్ గురించి అదితి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. 'మహా సముద్రం' షూట్‌లో తమ మధ్య పరిచయం ఏర్పడిందన్నారు. కొంతకాలానికి అది స్నేహంగా మారిందన్నారు. తనకెంతో ఇష్టమైన ప్రదేశంలో సిద్దార్థ్ తనకు ప్రపోజ్ చేశాడని చెప్పారు. మా నాన్నమ్మ అంటే నాకెంతో ఇష్టం. హైదరాబాద్‌లో ఆమె ఒక స్కూల్ ప్రారంభించారు. అది నాకెంతో ప్రత్యేకం. నా చిన్ననాటి రోజులు అక్కడే ఎక్కువగా గడిపా. కొన్నేళ్లక్రితం ఆమె కన్నుమూశారు. ఈ విషయం సిద్దార్థ్‌కు తెలుసు. ఓ రోజు నా వద్దకువచ్చి.. ఆ స్కూల్‌కు తీసుకువెళ్లమని అడిగాడు. మార్చిలో మేమిద్దరం అక్కడికి వెళ్లాం. మోకాళ్లపై కూర్చొని.. అతను నాకు ప్రపోజ్ చేశాడు. ఆమె ఆశీస్సుల కోసమే తాను అక్కడ ప్రపోజ్ చేసినట్లు చెప్పాడని అదితి చెప్పారు.

అయితే సిద్దార్థ్ గతంలోనే పెళ్లి చేసుకోగా..అతనికిది రెండో వివాహం.

## త్వరలోనే పట్టాలెక్కనున్న 'ధూమ్ 4'
### కీలక పాత్రలో కనిపించనున్న సూర్య



బాలీవుడ్‌లో తెరకెక్కిన హెయిస్ట్ యాక్షన్ ఫిల్మ్స్‌లో 'ధూమ్' కు విశేష ఆదరణ ఉంది. 2004లో తెరకెక్కిన ఈ చిత్రానికి ఇప్పటికే పలు సీక్వెల్స్ వచ్చాయి. బాక్సాఫీస్ వద్ద అవన్నీ సూపర్ హిట్స్ అందుకున్నాయి. ఈ ఫ్రాంఛైజీలోనే త్వరలో 'ధూమ్ 4' పట్టాలెక్కనున్నట్లు తెలుస్తోంది. చిత్ర నిర్మాణసంస్థ యశ్ రాజ్ ఫిల్మ్స్ ఈమేరకు సన్నాహాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. 'ధూమ్, పార్ట్ 2, 3'లకు కథను అందించిన ఆదిత్య చోప్రానే 'ధూమ్ 4'కీ వర్క్ చేస్తున్నారని.. ప్రస్తుతం ఉన్న ట్రెండ్‌కు అనుగుణంగా భారీస్థాయిలో దీనిని సిద్ధం చేసేందుకు నిర్మాతలు ప్రయత్నిస్తున్నారని తెలుస్తోంది. ఇదిలాఉండగా, ఈ చిత్రంలో కోలీవుడ్ నటుడు సూర్య కీలక పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. సినిమాలో ముఖ్యమైన ప్రతి నాయకుడి పాత్రలో సూర్య నటించనున్నారని.. ఈవిషయంపై చిత్రబృందం ఇప్పటికే ఆయన్ని సంప్రదించినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ రోల్‌లో యాక్ట్ చేసేందుకు ఆయన ఆసక్తి చూపారని టాక్. దీనిపై పలువురు సినీప్రియులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. సూర్య యాక్ట్ చేస్తే మరో స్థాయిలో ఉంటుందని వారు భావిస్తున్నారు. మరి కొంతమంది మాత్రం అధికారిక ప్రకటన కోసం వేచి చూస్తున్నామని అంటున్నారు. నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రల్లో యాక్ట్ చేయడం సూర్యకు కొత్త ఏమీ కాదు. ఆయన ఇప్పటికే '24', 'విక్రమ్' చిత్రాల్లో అలాంటి రోల్స్ పోషించారు. 2022లో వచ్చిన 'విక్రమ్' చిత్రంలో రోలెక్స్‌గా కనిపించి అందర్నీ ఆశ్చర్యపరిచారు. మాదక ద్రవ్యాల ముఠాకు నాయకుడిగా ఆయన నటన అందర్నీ కట్టిపడేసింది. రోలెక్స్ పాత్ర కనిపించేది కేవలం కొన్ని నిమిషాలే అయినప్పటికీ.. సినిమాకే హైలైట్‌గా నిలిచింది.




## వైవిధ్యమైన కథతో గొర్రె పురాణం


వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను అలరిస్తున్న నటుడు సుహాస్ (ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'గొర్రె పురాణం' బాబీ దర్శకుడు. సెప్టెంబర్ 20న ఈచిత్రం విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే తాజాగా సినిమా ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఒక గ్రామంలోని రెండు వర్గాల మధ్య ఒక గొర్రె వల్ల గొడవలు మొదలు కావడం.. దానిపై కేసు పెట్టడం వంటి అంశాలతో ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకునేలా సాగింది. విలక్షణమైన పాత్రలతో తనకంటూ నటుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నాడు హీరో సుహాస్. గత నెల 'ప్రసన్నవదనం' అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చిన మంచి విజయాన్ని అందుకున్న ఈ కుర్ర హీరో మరో సినిమాను విడుదలకు సిద్దం చేశాడు. ఆయన ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం గొర్రెపురాణం సినిమాకు బాబీ దర్శకత్వం వహిస్తుండగా.. ఫోకల్ సినిమాస్ బ్యానర్‌పై ప్రవీణ్ రెడ్డి సినిమాను నిర్మిస్తున్నాడు. విడుదలకు ఇంకా నాలుగు రోజులే ఉండడంతో ట్రైలర్‌ను వదిలింది చిత్రయూనిట్. ఈ ట్రైలర్ చూస్తుంటే.. ఒక గొర్రె చేసిన పని వలన రెండు మతాలకు చెందిన ప్రజలు గొడవపడుతున్నట్లు ట్రైలర్ చూస్తే తెలుస్తుంది. అయితే అసలు గొర్రెకు హిందు, ముస్లింలకు మధ్య గొడవ ఏంటి.. రెండు మతాలకు చెందిన ఆ ఊరి ప్రజలు అసలు గొర్రెను ఎందుకు చంపాలి అనుకుంటారు. సుహాస్ జైలులో ఎందుకు ఉంటాడు. గొర్రెకు సుహాస్‌కు సంబంధం ఏంటి అనేది తెలియాలంటే ఈ సినిమా సినిమా చూడాల్సిందే.

## ప్రేమకు బ్రేకప్ చెప్పేశా

ఈ మధ్యకాలంలో ఇష్టపడిన వ్యక్తితో ప్రేమ, కొంతకాలానికి బ్రేకప్ సినీ సెలబ్రిటీల విషయంలోనూ ఇలాంటివి చూస్తూనే ఉంటాం. తాజాగా 'సీతారామం' ఫేం మృణాల్ ఠాకుర్‌కు కూడా బ్రేకప్ అయిందట. ఏడు నెలల క్రితం బ్రేకప్ జరిగిన విషయాన్ని తాజాగా రివీల్ చేసింది. ఇటీవల ఆమె ఓ పాడ్ కాస్ట్‌లో మాట్లాడుతూ తన లవ్ స్టోరీస్ గురించి చెప్పింది. ఒక వ్యక్తి జీవితంలోకి సరైన వ్యక్తి భాగస్వామిగా రావడానికి కాస్త సమయం పడుతుంది. ఈలోపు జీవితంలోకి వచ్చివెళ్లేవాళ్లు చాలామంది ఉంటారు. ఫైనల్‌గా మనకు ఎవరు సూట్ అవుతారనేది మనకే తెలుస్తుంది. ఆ విషయంలో పక్కాగా క్లారిటీ ఉండాలి. నేను గతంలో ఓ వ్యక్తితో రిలేషన్‌లో ఉన్నా. కానీ నటితో డేటింగ్ అతడికి ఎందుకో ఇష్టం లేదు. పద్ధతి గల కుటుంబం నుంచి వచ్చానని చెప్పాడు. ఆ మాట నాకు నచ్చలేదు. దీంతో బ్రేకప్ చెప్పేసుకున్నాం. ఏడు నెలల క్రితమే నాకు బ్రేకప్ అయింది. అయితే నన్ను చేసుకునేవాడికి లుక్స్ లేకపోయినా పర్లేదు కానీ మంచి మనిషి అయ్యిండాలి' అని మృణాల్ ఠాకుర్ చెప్పుకొచ్చింది. ఇప్పటివరకు తన జీవితంలో బ్రేకప్స్ జరిగాయి కానీ మరీ బాధ పడిపోయేంతలా ఏం కాలేదని మృణాల్ చెప్పింది. మ్యూచ్‌వల్ అండర్‌స్టాండింగ్ తోనే విడిపోయామని పేర్కొంది. హిందీ సీరియళ్లతో కెరీర్ ప్రారంభించిన మృణాల్ 'సీతారామం' తెలుగులో బ్లాక్ బస్టర్ ఎంట్రీ ఇచ్చింది. 'హాయ్ నాన్న', 'ఫ్యామిలీస్టార్' తదితర చిత్రాలతో గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం హిందీ చిత్రాలతో బిజీగా ఉంది.




# రామ్ చరణ్.. బీస్ట్ మోడ్ ఆన్..




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, తన తదుపరి సినిమా కోసం సిద్ధమవుతున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కనున్న ఈ ప్రాజెక్టును కిలారు వెంకట సతీష్ నిర్మించనుండగా, సుకుమార్ రైటింగ్స్ కూడా నిర్మాణంలో భాగమవుతోంది. ఈ ప్రాజెక్ట్ సెట్స్ పైకి రాక ముందు నుంచే భారీ అంచనాలను రేకెత్తిస్తోంది. బుచ్చిబాబు RC16 కోసం ప్రత్యేకంగా ఉత్తరాంధ్ర నేపథ్యంలో స్పోర్ట్స్ డ్రామా అంశాలతో కథ రాసారని టాక్. రామ్ చరణ్ ఈ సినిమాలో పూర్తిగా కొత్త లుక్‌లో కనిపించబోతున్నారు. ఇప్పటికే మేకోవర్ కోసం సన్నాహాలు ప్రారంభమైనట్టు తెలుస్తోంది. రామ్ చరణ్ తన పాత్ర కోసం నేటివిటీ టచ్ ఉన్న మాండలికంలో మాట్లాడతారని సమాచారం. ఇది చరణ్ నటనకు మరో సవాల్‌గా ఉండబోతుందని అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

RC16 కోసం చరణ్ శారీరకంగా మార్పు కోసం కసరత్తులు మొదలుపెట్టారు. ప్రత్యేకమైన ఫిజికల్ ఫిట్నెస్ తో మేకోవర్ అవ్వాల్సి ఉంది. రామ్ చరణ్ తన ఫిట్నెస్ కోచ్ శివోహంతో ఉన్న ఫొటోను పోస్ట్ చేశాడు. ఇందులో ఆయన కొత్త లుక్ కోసం చేసిన హార్డ్ వర్క్ స్పష్టంగా కనిపిస్తోంది. “బీస్ట్ మోడ్ ఆన్” అని చరణ్ ఈ ఫోటోకి క్యాప్షన్ ఇచ్చారు. సినిమా ప్రారంభానికి ముందే ఈ లుక్ పై చర్చలు మొదలయ్యాయి, ఇది అభిమానుల్లో మరింత అంచనాలను పెంచుతోంది. ఇక సినిమాలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ఏ.ఆర్. రెహమాన్ చాలా కాలం అనంతరం ఈ సినిమాతో తెలుగులో రీ ఎంట్రీ ఇచ్చారు. ఇప్పటికే మూడు పాటలను కంపోజ్ చేసినట్టు తెలుస్తోంది.

సినిమాలో రెహమాన్ నుంచి వచ్చే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా మరో హైలైట్ కానుందనే చర్చ మొదలైంది. ప్రత్యేకంగా, ఈ సినిమా రామ్ చరణ్ కెరీర్‌లో ఉత్తమమైన సినిమా అవుతుందనే టాక్ పరిశ్రమలో ఉంది. అంతేకాకుండా, బుచ్చిబాబు సానా దర్శకత్వం, కథాపరంగా ఆయన రాసిన డైలాగ్స్ ఈ సినిమాను మరింత స్పెషల్‌గా మార్చనున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. చరణ్ ఇందులో పంచ్ డైలాగ్స్ తో పాటు కొంత కామెడీ టైమింగ్ కూడా చూపించబోతున్నారని సమాచారం. మొత్తానికి, %=జ%16 చిత్రం రామ్ చరణ్ కెరీర్‌లో మరో కీలక ఘట్టంగా నిలవనుందని ఇండస్ట్రీలో పెద్ద ఎత్తున చర్చించుకుంటున్నారు